అట్లీ సినిమా కన్‌ఫర్మ్!

అల్లు అర్జున్ తాజా చిత్రం 'పుష్ప-2' డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలునెలకొన్నివున్నాయి. ఈ సినిమా తర్వాత బన్నీ చేయబోయే చిత్రం గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తమిళ అగ్ర దర్శకుడు అట్లీతో అల్లు అర్జున్ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారని గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. అగ్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమాను తెరకెక్కించనుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా అధికారిక ప్రకటనకు రంగం సిద్ధమైందని తెలిసింది. మరో వారం రోజుల్లో నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించనుందని సమాచారం. 'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు అగ్ర హీరో అల్లు అర్జున్. ఇక 'జవాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నాడు తమిళ దర్శకుడు అట్లీ. మరి వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే అభిమానులకు ఇక పండగే అనుకోవచ్చు.

నా కల నెరవేరింది

వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ చెన్నై ఫ్రాంచైజీని కొనుగోలు చేసినట్లు అగ్ర కథానాయిక సమంత ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. తన జీవితంలో ఇదొక కొత్త ఆరంభమని ఆనందం వ్యక్తం చేసింది. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పికిల్‌బాల్ గేమ్ ఆడుతున్న వీడియో ఒకటి షేర్ చేసింది. ఇందులో సమంత ఎంతో ఎనర్జిటిక్‌గా కనిపించింది. ఈ వీడియోను చూసిన వారు గేమ్ పట్ల సమంత పట్టుదల చూసి ఆశ్చర్యపోతున్నారు. చిన్నతనం నుంచి తనకు ఆటలంటే చాలా ఇష్టమని, ఫ్రాంచైజీని కొనుగోలు చేయడంతో తన కల నెరవేరిందని సమంత పేర్కొంది. 'పాఠశాల రోజుల్లో స్పోర్ట్స్‌పై ఎంతో మక్కువ ఉండేది. అయితే నా పేరెంట్స్ మాత్రం ఆటలపై దృష్టి పెడితే చదువును నిర్లక్ష్యం చేస్తానేమోనని భయపడేవారు. అలా ఆటలకు దూరమయ్యాను. ఆ తర్వాత స్పోర్ట్స్ విలువేమిటో తెలిసొచ్చింది. అవి మనల్ని ఆరోగ్యంగా వుంచడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని సాగించేలా ధైర్యాన్నిస్తాయి' అని సమంత చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో అందరిని ఆకట్టుకుంటున్నది. ఇక సినిమాల విషయానికొస్తే స్వీయ నిర్మాణంలో సమంత 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని రూపొందిస్తున్నది.

టీజర్ వచ్చేది ఆరోజే..!

'కల్కి' సినిమాతో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్నారు ప్రభాస్. ఈ ఆనందోత్సాహంలో తన తదుపరి సినిమాల కోసం సన్నద్ధమవుతున్నారు. హనురాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న పీరియాడిక్ యాక్షన్ చిత్రం ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇదిలావుండగా మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాజాసాబ్' కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. జూలైలో విడుదల చేసిన గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ప్రభాస్ రొమాంటిక్ లుక్స్‌తో ఫిదా చేశారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. ప్రభాస్ జన్మదినమైన అక్టోబర్ 23న టీజర్‌ను విడుదల చేస్తారని వార్తలొస్తున్నాయి. ఏప్రిల్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రస్తుతం 'రాజాసాబ్' చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. ప్రభాస్ తన షూటింగ్ పార్ట్‌ను ఇప్పటికే పూర్తి చేశారు. తాజా షెడ్యూల్‌లో ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు.

స్ఫూర్తినిచ్చే 'దీక్ష'

ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'దీక్ష'. కిరణ్‌కుమార్, అలేఖ్య రెడ్డి జంటగా నటిస్తున్నారు. అశోక్ కుమార్, కృష్ణా రెడ్డి నిర్మాతలు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు ఆర్.కె.గౌడ్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో భాగంగా గ్రాఫిక్ వర్క్స్ జరుగుతున్నాయి. కృషి, పట్టుదల, దీక్ష ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించగలమనే స్ఫూర్తివంతమైన పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కథాగుణంగా మంచి పాటలు కుదిరాయి' అన్నారు. సవాలుతో కూడిన పాత్రలు చేయడం ఆనందంగా ఉందని నాయకానాయికలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

రచయిత నరసింగరావు కన్నుమూత

సీనియర్ సినీ రచయిత నడిమింటి నరసింగరావు (72) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబీ', రామ్‌గోపాల్‌వర్మ డైరెక్ట్ చేసిన 'అనగనగా ఒకరోజు' చిత్రాలతో పాటు పలు విజయవంతమైన చిత్రాలకు ఆయన మాటలు రాశారు. సినిమాల్లోకి రాకముందు ఆయన 'బొమ్మలాట' అనే నాటకం ద్వారా మంచి గుర్తింపును పొందారు. అనంతరం పాతబస్తీ, ఊరికి మొనగాడు, కుచ్చి కుచ్చి కూనమ్మా వంటి సినిమాలకు మాటల రచయితగా పనిచేశారు. దూరదర్శన్‌లో ప్రసారం అయిన 'తెనాలి రామకృష్ణ' సీరియల్‌తో పాటు ఈటీవీలో పాపులర్ అయిన వండర్‌బోయ్, లేడీ డిటెక్టివ్, అంతరంగాలు సీరియల్స్‌కు నరసింగరావు మాటలు అందించారు. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని తెలియజేశారు.

నీలి మేఘాలలో తేలిపోదాం..

హీరో రానా సమర్పణలో రూపొందిస్తున్న చిత్రం '35-చిన్న కథ కాదు'. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నందకిషోర్ ఈమాని దర్శకుడు. సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'నీలి మేఘాలలో..' అనే పాటను విడుదల చేశారు. ప్రేమికుల మనోభావాలకు అద్దం పడుతూ సాగిన ఈ పాటకు వివేక్‌సాగర్ స్వరాల్ని అందించగా భరద్వాజ్ రచించారు. పృథ్వీ హరీష్ ఆలపించారు. మధ్య తరగతి జీవితాలను ఆవిష్కరించే కథ ఇదని, పాఠశాల తాలూకు ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదలకానున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

పవర్‌ఫుల్ పోలీస్ స్టోరీ

దేవ్‌గిల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అహో విక్రమార్క'. ప్రముఖ దర్శకుడు రాజమౌళి వద్ద కో డైరెక్టర్‌గా పనిచేసిన త్రికోటి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు త్రికోటి చిత్ర విశేషాలు తెలియజేస్తూ ''మగధీర' టైంలో దేవ్‌గిల్‌తో పరిచయం ఏర్పడింది. ఆయనకు ప్రేక్షకుల్లో విలన్ ఇమేజ్ ఉంది. అందుకే ఫ్యామిలీ కథాంశంతో సినిమా చేస్తే అంతగా కుదరదని భావించాం. చివరకు పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రతో కథను సిద్ధం చేశాం. ఇందులో దేవ్‌గిల్ ఆంధ్రా నుంచి పుణేకు ట్రాన్స్‌ఫర్ అయిన పోలీస్ అధికారి పాత్రలో కనిపిస్తారు. యాక్షన్, ఎమోషనల్ అంశాలు కలబోసిన ఈ కథ అందరికి కనెక్ట్ అవుతుంది. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ మంచి సంగీతంతో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. ఈ సినిమాలో మదర్ సెంటిమెంట్ కూడా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

బాలీవుడ్ మొత్తం కుట్రలే!

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందిరాగాంధీ పాత్రలో కంగనా రనౌత్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నది. ఈ సందర్భంగా ఓ జాతీయ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాలీవుడ్ సినీరంగంపై కంగనా రనౌత్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ప్రతిభ ఉన్న వారికి బాలీవుడ్‌లో గుర్తింపు లభించదని, అలాంటి వారిని అణగదొక్కడానికి కుట్రలు చేస్తారని ఆరోపించింది. ఇండస్ట్రీపై ధిక్కార స్వరం వినిపించినందుకే ఓ సమయంలో తనను బహిష్కరించారని పేర్కొంది. 'నా దృష్టిలో బాలీవుడ్ ఎలాంటి కనికరం లేని ప్రదేశం. ఇక్కడ ఎవరైనా ఎదుగుతుంటే అసూయపడతారు. ప్రతిభావంతుల కెరీర్‌ను ఎలా నాశనం చేయాలని నిరంతరం ప్రణాళికలు రచిస్తుంటారు. పీఆర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని వారిపై దుష్ప్రచారం చేయిస్తారు. చివరకు ఇండస్ట్రీ నుంచి వారిని వెలివేసేలా పరిస్థితులను సృష్టిస్తారు' అని కంగనా రనౌత్ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

సస్పెన్స్ థ్రిల్లర్ 'వీక్షణం'

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటిస్తున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకుడు. పద్మనాభ సినీ ఆర్ట్స్ పతాకంపై పి.పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఎన్నెన్నో..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. మెలోడీ ప్రధాన ప్రేమగీతంగా ఈ పాటను తీర్చిదిద్దారు. సమర్థ్ గొల్లపూడి సంగీతాన్ని అందించిన ఈ పాటను రెహ్మాన్ రాయగా సిధ్ శ్రీరామ్ ఆలపించారు. సస్పెన్స్, మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, చిత్రీకరణ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్, సంగీతం: సమర్థ్ గొల్లపూడి, దర్శకత్వం: మనోజ్ పల్లేటి.

వినోదాల ప్రేమాయణం

త్రిగుణ, మేఘా చౌదరి జంటగా నటిస్తున్న కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'కడుపుబ్బా నవ్వించే కామెడీతో పాటు కథలోని థ్రిల్లర్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కథలోని మలుపులు ఉత్కంఠను పంచుతాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. షాయాజీషిండే, పోసాని కృష్ణమురళి, రఘుబాబు, పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఆనంద్‌మంత్ర, దర్శకత్వం: మల్లి యేలూరి.